
సాక్షి
ఒడిశా
శుక్రవారం, 12, ఏప్రిల్, 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,94,224లు, బంగారం 7గ్రాముల 780 మిల్లీగ్రాములు , వెండి 43 గ్రాముల 400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



భక్తిశ్రద్ధలతో దొండొనాచో దీక్ష

పలు ప్రాంతాల్లో దొండొనాచో దీక్షలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. భక్తులు విన్యాసాలు చేస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు.

- 8లో



రహదారి రక్తసిక్తం

రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృత్యువాతపడ్డారు. దీంతో ఆయా కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి.

- 8లో

న్యూస్‌రీల్

'బీజేపీ అభివృద్ధికి కృషి చేయాలి'



మాట్లాడుతున్న అధ్యక్షుడు సుభాష్ సాహు పితవాసి పండా, బిభుతి జెన్నా, మోహన్ పాత్రో, సునీల్ సాహు, కైలాస్ సడంగి

బరంపురం : గంజాం జిల్లాలో బీజేపీ అభివృద్ధికి కృషి చేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు సుభాష్ సాహు కోరారు. గురువారం స్థానిక రొంగాయిలొండా బ్లాక్‌లో జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ప్రతి బ్లాక్‌లలోనే పార్టీ సభ్యులను చేర్చుకుని కింది స్థాయి నుంచి పటిష్ట పరిచే విధంగా సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో బీజేపీ బరంపురం లోక్‌సభ అభ్యర్థి ప్రదీప్ పాణిగ్రాహి, బిభుతి జెన్నా, కార్యదర్శి మదన్ మోహన్ పాత్రో, సునీల్ సాహు, పితవాసి పండా కైలాస్ సడంగి జిల్లా బ్లాక్ అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి'



పోలీసు అధికారుల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న బరంపురం ఎస్పీ డాక్టర్ సార్థక్ సడంగి

బరంపురం : సాధారణ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలని ఎస్పీ డాక్టర్ సార్థక్ సడంగి ఆదేశించారు. ఆయన అధ్యక్షతన గురువారం బరంపురం పోలీసులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ప్రజలు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. ముఖ్యంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన గంజాం, గజపతి, బౌద్, కొందమాల్, నయగడ్, రాయగడా, మల్కన్‌గిరి, నవరంగపూర్, కోరాపూట్, కలాహండి జిల్లాల్లో నిఘా ఉంచి ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు. సైబర్ క్రైమ్‌లు పెరుగుతున్నాయని, వీటిపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. జైలు నుంచి బయటకు వచ్చిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గంజాం జిల్లాలో పెచ్చురేగుతున్న నేరస్తుల ఆట కట్టించేందుకు అపరాధి ముక్తి అభియాన్ పేరుతో ఆపరేషన్ మరింత పటిష్టం చేయాలన్నారు.

ఎలుగుబంటి దాడిలో యువకుడికి గాయాలు



మత్తిలి ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రమేష్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి పలారీపోదర్ గ్రామంలో ఎలుగుబంటి దాడిలో రమేష్ మారి(25) గాయపడ్డాడు. రమేష్ అడవిలో విప్పపూల కోసం గురువారం ఉదయం వెళ్లాడు. చీకటిగా ఉన్న సమయంలో వెళ్లడంతో అక్కడే ఉన్న ఎలుగుబంటి ఆయనపై దాడికి తెగబడింది. దీంతో రమేష్ పెద్దగా కేకలు వేశాడు. వెంటనే స్థానికులు చేరుకుని ఎలుగును తరిమారు. రమేష్‌ను మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

అదరహో..!



సినీ గాయకుడు మనోను సన్మానిస్తున్న నెక్కంటి భాస్కరరావు



ఉత్సవాలకు హాజరైన మాజీ మంత్రి హిమిరిక, కౌసల్య, జిన్ను, భాస్కరరావు తదితరులు



స్థానిక కళాకారిణి అనురాధ పాణిగ్రాహి

- రాయగడలో ముగిసిన ఉగాది ఉత్సవాలు
- ఉర్రూతలూగించిన సినీ కళాకారుల ప్రదర్శనలు
- సందడి చేసిన యువతీ,యువకులు

రాయగడ:

ఉగాది సంబరాలు ఆనందోత్సాహాల నడుమ ఘనంగా ముగిశాయి. రాయగడలోని తేజస్వీ హోటల్ మైదానంలో జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో కొనసాగిన ఉగాది ఉత్సవాలు బుధవారం అర్ధరాత్రితో ముగిశాయి. సినీ నేపథ్య గాయకులు మనో, శ్రావణ భార్గవి, అరుణ్ కౌండిన్య, హారికా నారాయణ్ తదితర బృందం ఆధ్వర్యంలో జరిగిన సినీ సంగీత విభావరి యువతను ఉర్రూతలూగించింది. ఒక్కో పాటకు యువతీ, యువకులు డ్యాన్సులు చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. అర్ధరాత్రి రాత్రి 1.30 గంటల వరకు కొనసాగిన ఈ ఉత్సవాల్లో నేపథ్య గాయకుల పాటలను ఆస్వాదిస్తూ స్థానికులు చివరివరకు సందడి చేశారు. డ్రమ్స్ పవన్ సూట్‌కేస్‌పై వాయించిన మ్యూజిక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక కళాకారిణి, ఒడియా చలనచిత్ర నేపథ్య గాయని, నటి అనురాధ పాణిగ్రాహి పాడిన నెల్లూరి నెరజానా, రొగొబొతి పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. అనంతరం గాయకుడు మనోను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు సన్మానించారు. ప్రముఖ వేదపండితులు రేజేటి శ్రీనివాస్ శర్మ, శ్రీరాం శర్మలను ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు చంద్రమౌళి కుముందాన్, సలహాదారులు శిల్ల జగన్నాధరావులు సత్కరించారు. అనంతరం 55 ఏళ్ల పైబడిన వారికి నిర్వహించిన సంప్రదాయ వస్త్రధారణ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రి లాల్‌బిహారి హిమిరిక, కొరాపుట్ లోక్‌సభ మాజీ ఎంపీ జిన్ను హికక, సతీమణి కౌసల్య హికక, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు.



సూట్‌కేసుపై సంగీతాన్ని వినిపిస్తున్న డ్రమ్స్ పవన్



సాంస్కృతిక కార్యక్రమాల్లో స్థానిక కళాకారులు



వేదికపై నేపథ్య గాయకులు

టాటూలకు టాటా

- 15 రోజుల్లో టాటూలను తొలగించాల్సిందే
- ఒడిశా పోలీసులకు ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు

భువనేశ్వర్: రాష్ట్రంలో పోలీసు వర్గాలకు సరికొత్త ఆంక్షలు జారీ అయ్యాయి. శరీర భాగాలపై పచ్చబొట్లు (టాటూ) ఉండకూడదని, టాటూలను 15 రోజుల్లోగా తొలగించాలని జంట నగరాల కమిషనరేట్ పోలీసులు, స్పెషల్ సెక్యూరిటీ బెటాలియన్ పోలీసులను ఆదేశించినట్లు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సెక్యూరిటీ) తెలిపారు. ఇకపై యూనిఫాంలో ఉన్న సిబ్బంది తమ ముఖం, మెడ, చేతులపై టాటూలు వేయకూడదని, వృత్తిపరమైన హోదా దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇటీవల ఎక్కువ మంది పోలీసులు ప్రధానంగా పురుషులు టాటూలు వేసుకుంటున్నారు. ఈ చర్య బెటాలియన్, ఒడిశా పోలీసుల ప్రతిష్టను కించపరిచేలా చేస్తోందనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో అన్ని వర్గాల రక్షక ఇన్‌చార్జ్‌లు యూనిఫాం ధారణలో శరీర భాగంలో టాటూలు ప్రదర్శించిన వారి జాబితాను సిద్ధం చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. శరీరంపై పచ్చబొట్లు 15 రోజులలోపు శాశ్వతంగా తొలగించాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

80 క్వింటాళ్ల విప్పపువ్వు స్వాధీనం

- నలుగురి అరెస్టు

రాయగడ: సారా తయారీకి వినియోగించే విప్పపువ్వును అక్రమంగా రెండు వ్యానుల్లో తరలిస్తుండగా అబ్కారీశాఖ అధికారులు గురువారం పట్టుకున్నారు. దీనికి సంబంధించి నలుగురి వ్యక్తులను అరెస్టు చేశారు. అబ్కారీ శాఖ ఇన్‌స్పెక్టర్ సంజయ్ కుమార్ ప్రధాన్ తెలియజేసిన వివరాల ప్రకారం.. జిల్లాలోని చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలో గల భెజా ప్రాంతంలో అబ్కారీ శాఖ అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో రెండు బొలేరో వాహనాలను అనుమానించి వాటిని ఆపి తనిఖీలు నిర్వహించారు. అందులో 80 క్వింటాళ్ల విప్పపువ్వు (బస్తాలు) గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసిన అధికారులు అందుకు సంబంధించి కలహండి జిల్లాకు చెందిన రుద్రప్రసాద్, సురేష్ చిందా, భవాణి.గొహిర్, దుస్మంత్ జుడాను పట్టుకుని కోర్టుకు తరలించారు.



నిందితులను పట్టుకున్న అధికారులు

కాంగ్రెస్‌కు పట్టం కట్టండి



మాట్లాడుతున్న తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: కొరాపుట్‌లో జిల్లా కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక బాబాసాహేబ్ కల్యాణ మండపంలో జిల్లా కార్యకర్తలతో అభ్యర్థుల సమావేశం జరిగింది. డీసీసీ అధ్యక్షుడు శశిభూషణ పాత్రో అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాహిణీపతి ప్రసంగిస్తూ పార్టీ ప్రజలకు చేసిన వాగ్దానాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. బీజేడీ, బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించారు. జిల్లాలో పార్టీ శ్రేణులు సమైఖ్యంగా ఉద్యమిస్తే పూర్వ ఫలితాలు సాంధించగమన్నారు. ప్రతీ ఓటరు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా హస్తం గుర్తుపై ఓటు వేయాలని విన్నవించారు. ఈ సమావేశంలో లోక్ సభఎన్నికల పర్యవేక్షకులు రవీంద్ర దొలబి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రవీంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 9 హామీల పత్రం ప్రతి ఇంటికీ చేర్చాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మీణాక్షీ బాహిణీపతి, కొరాపుట్ ఎంపీ అభ్యర్థి సప్తగిరి శంకర ఉల్క, పొట్టంగి ఎమ్మెల్యే అభ్యర్థి రామచంద్ర కడమ్, కొరాపుట్ ఎమ్మెల్యే అభ్యర్థి కృష్ణ కులదీప్, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి పవిత్ర వాంత, జిల్లా కాంగ్రెస్ కార్యాలయ అధ్యక్షుడు మనోజ్ ఆచార్య, రాష్ట్ర వార్ రూమ్ ఇన్‌చార్జ్ ప్రసాద్ మహాపాత్రో, జయపురం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేంద్ర కుమార్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు



అరబింద ధాలి



ప్రేమానంద నాయక్

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభలో ఇద్దరు సభ్యులపై అనర్హత వేటు పడింది. అధికార బిజూ జనతా దళ్ నుంచి వైదొలిగి ఇటీవల భారతీయ జనతా పార్టీలో చేరిన అరబింద ధాలీ, ప్రేమానంద నాయక్‌లపై అనర్హత వేటు వేస్తూ శాసనసభ స్పీకరు ప్రమీలా మల్లిక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఈ చర్య చేపట్టినట్లు పేర్కొన్నారు. అనర్హత వేటు తక్షణం అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

- అరబింద ధాలి జయదేవ్ శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తుండగా ప్రేమానంద నాయక్ తెల్కోయ్ నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. భారత రాజ్యాంగం పదో షెడ్యూల్ 6(1) కింద స్పీకర్‌కు కల్పించిన అధికారాలతో వీరిద్దర్ని అనర్హులుగా ప్రకటించినట్లు వివరించారు.
- ఇద్దరిపైనా అనర్హత వేటు వేయాలని మార్చి 18న ప్రభుత్వ చీఫ్ విప్ ప్రశాంత కుమార్ ముదులి పిటిషన్ దాఖలు చేశారు. అసెంబ్లీకి ఎన్నికైన బిజూ జనతా దళ్ నుంచి ప్రాథమిక సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నారని పిటిషన్‌లో వివరించారు. ఈ మేరకు విచారణ నిమిత్తం అరబింద ధాలి, ప్రేమానంద నాయక్‌లకు నోటీసులు పంపారు. ప్రతిస్పందించడంలో విఫలమై వ్యక్తిగత విచారణ కోసం స్పీకర్ ముందు హాజరు కాలేదు. ఈ పరిస్థితుల్లో తక్షణమే వారిని ఒడిశా అసెంబ్లీ సభ్యులుగా తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ చర్యతో రాష్ట్ర శాసన సభలో రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. మరో వైపు అరబింద ధాలీ భారతీయ జనతా పార్టీ టికెట్‌పై జయదేవ్ నియోజకవర్గం నుంచి వచ్చే శాసన సభ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు.

వారికి మినహాయింపు..!

భారతీయ జనతా పార్టీలో చేరిన బిజూ జనతా దళ్ శాసనసభ సభ్యులు తమ సభ్యత్వాన్ని కోల్పోయారు. కానీ భారతీయ జనతా పార్టీ నుంచి గెలిచి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి అధికార బిజూ జనతా దళ్‌లో చేరిన ఇరువురు శాసన సభ సభ్యుల వ్యతిరేకంగా ఇప్పటి వరకు స్పీకరు ఎటువంటి చర్యలు చేపట్టక పోవడం చర్చనీయాంశమైంది. బీజేడీలో చేరిన బీజేపీ అభ్యర్థులు అధిరాజ్ పాణిగ్రాహి, సుకాంత నాయక్ వ్యతిరేకంగా ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం చర్యల పట్ల అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

59 మంది సభ్యులతో కాంగ్రెస్ ప్రచార కమిటీ

భువనేశ్వర్:

త్వరలో జరగనున్న లోక్‌సభ, శాసనసభ ఎన్నికల కోసం 59 మంది సభ్యులతో కాంగ్రెస్ ప్రచార కమిటీని ఏర్పాటు చేసింది. ఒడిశా కాంగ్రెస్ ప్రచార కమిటీకి సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి భక్తచరణ్ దాస్ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా నవజ్యోతి పట్నాయక్‌ను నియమించారు. ప్రచార కమిటీ కన్వీనర్‌గా సుధాంశు శేఖర్ దేవ్‌ను ప్రకటించారు.

ఈ కమిటీలో ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్, కాంగ్రెస్ శాసన సభ నాయకుడు (ఎల్‌ఓపీ) నరసింగ మిశ్రా, మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగొ, కేంద్ర మాజీ మంత్రులు కామాఖ్య ప్రసాద్ సింగ్‌దేవ్, శ్రీకాంత్ జెనా, ఓపీసీసీ మాజీ అధ్యక్షుడు నిరంజన్ పట్నాయక్, జయదేవ్ జెనా, ప్రసాద్ హరిచందన్, మాజీ పార్లమెంట్ సభ్యులు రామచంద్ర ఖుంటియా, మాజీ చీఫ్ సెక్రటరీ బిజయ్‌కుమార్ పట్నాయక్, కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలాకా, మాజీ మంత్రులు పంచానన్ కనుంగో, శరత్ రౌత్, జగన్నాథ్ పట్నాయక్, బిజయలక్ష్మి సాహూ సభ్యులుగా ఉన్నారు. వీరితో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, అన్ని శాఖల ముఖ్య నాయకులు, జిల్లా కాంగ్రెస్ కమిటీల (డీసీసీ) అధ్యక్షుల్ని సభ్యులుగా చేర్చారు.

'ఈద్' ముబారక్

బరంపురం : నగరంలో ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ బరంపురం ఎమ్మెల్యే డాక్టర్ రమేష్ చంద్ర చావ్ పట్నాయక్, నగర మేయర్ సంఘమిత్ర దొళాయి, బీడీఏ మాజీ అధ్యక్షుడు సుబాష్ మహరణ తదితరులు హాజరయ్యారు. ఉదయం ముస్లిం సోదరులు కొత్త బట్టలు ధరించి స్థానిక జామా మసీదు పడియా, బాపురు బజార్, కాపు వీధి, హన్‌మాన్ మందిర్ రోడ్‌లో మసీదులకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు.

పర్లాకిమిడి: పవిత్రమైన రంజాన్ మాసం పూర్తయిన సందర్భంగా ముస్లిం సోదరులు ఈద్ పండుగను పర్లాకిమిడిలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఉప్పరవీధిలో జామా మసీదు నుంచి ముస్లిం మతపెద్దలు శోభాయాత్రను ప్రారంభించి మార్కెట్ మీదుగా తిరిగి మసీదుకు చేరుకున్నారు. అనంతరం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు జరిపి పేద ముస్లిం మహిళలకు ఇనామ్‌లు అందజేశారు. ముస్లిం సోదరులు మసీదులో ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలియజేసుకున్నారు.



జామా మసీదు పడియాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



'ఈద్' ముబారక్ వేడుకల్లో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే రమేష్ చావ్ పట్నాయక్, మేయర్ సంఘమిత్ర సుబాష్ మహరణ కార్పొరేటర్లు



ఈద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరుల శోభాయాత్ర



ఉప్పరవీధిలో జామా మసీదు నుంచి బయలుదేరిన ముస్లింలు

ఈవీఎంల తరలింపు

భువనేశ్వర్:

రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఏకకాలంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు ముమ్మరం చేసింది. దీనిలో భాగంగా ఖుర్దా జిల్లా ప్రధాన కార్యాలయం నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను (ఈవీఎం) భువనేశ్వర్‌కు తరలించారు. భువనేశ్వర్ లోక్‌సభ స్థానం, ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను పటిష్ట భద్రతా ఏర్పాట్ల మధ్య భువనేశ్వర్ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. రాష్ట్ర రాజధానికి మొత్తం 2,332 ఈవీఎంలను తరలించారు. వాటన్నింటిని స్థానిక బీజేబీ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరించారు. ఇందులో దాదాపు 25 శాతం రిజర్వ్‌లో ఉంచుతారు. భద్రతా చర్యల్లో భాగంగా పటిష్ట పోలీసు సిబ్బందిని రంగంలోకి దించారు. ఖుర్దా జిల్లా కలెక్టర్‌తో సహా సీనియర్ అధికారులు ఈ ప్రక్రియని పర్యవేక్షించారు. రాష్ట్రంలో మే 13, 20, 25, జూన్ 1 తేదీల్లో నాలుగు దశల్లో ఓటింగ్ జరగనున్న సంగతి తెలిసిందే.



ఈవీఎంలను తరలిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాదంలో నుజ్జయిన కారు

బరంపురం : నగర సమీపంలోని కుకుడాఖండి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. పుల్బాణి నుంచి వస్తున్న కారు, బరంపురం మీదుగా వెళ్తున్న బైక్ పరస్పరం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ నడుపుతున్న కుకుడాఖండి గ్రామానికి చెందిన మహేంద్ర స్వామ్‌యి ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. వెనుక కూర్చున్న వ్యక్తి తీవ్రంగా గాయపడటంతో 108 అంబులెన్స్‌లో ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీపూర్ టికెట్ నాదే

- అభ్యర్థిత్వం ప్రకటించక ముందే నామినేషన్ తేదీ ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే కైలాష్


కైలాష్ కులసిక

కొరాపుట్: అభ్యర్థిత్వం అధిష్ఠానం ప్రకటించకముందే ఓ అభ్యర్థి తన నామినేషన్ తేదీ ప్రకటించి సంచలనం సృష్టించారు. కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ అసెంబ్లీ స్థానంలో ఈ నెల 24న బీజేడీ తరఫున నామినేషన్ వేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కైలాష్ కులసిక ప్రకటించారు. అందరూ రావాలని గురువారం ఫేస్‌బుక్ సాక్షిగా మరీ విజ్ఞప్తి చేశారు. ఇంత జరిగినా బీజేడీ ఇక్కడ అభ్యర్థిని ప్రకటించకపోవడం గమనార్హం. అనంతరం కైలాష్ మీడియాతో మాట్లాడుతూ ఇక్కడ బీజేడీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రభు జానీ ఉన్నప్పటికీ టిక్కెట్ తనదేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుజానీ మద్దతు కూడా తనకే ఉందన్నారు.

బీజేడీ అభ్యర్థుల జాబితా విడుదల


లేఖశ్రీ సామంతసింగార్, బాలాసోర్ లోక్‌సభ అభ్యర్థి

భువనేశ్వర్: రాష్ట్రంలో అధికార బిజూ జనతా దళ్ రాబోయే ఎన్నికలకు మరికొంత మంది అభ్యర్థులతో కూడిన జాబితా గురువారం విడుదల చేసింది. ఈ జాబితా ప్రధానంగా బాలాసోర్ లోక్‌సభ నియోజకవర్గం పట్ల ఉత్కంఠకు తెరదించింది. ఇక్కడి నుంచి బీజేడీ అభ్యర్థిగా లేఖశ్రీ సామంతసింగార్ అభ్యర్థిత్వాన్ని సీఎం నవీన్ ప్రకటించారు. దీంతో రాష్ట్రంలో 21 పార్లమెంటరీ నియోజక వర్గాలకు బీజేడీ అభ్యర్థుల్ని ఖరారు చేయడం పూర్తి అయింది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి బీజేడీలో ఇటీవల చేరిన లేఖశ్రీ సామంతసింగార్‌కు మంచి బహుమానం దక్కినట్లయ్యింది. బాలాసోర్ పార్లమెంటు స్థానం నుంచి వీడియో సందేశం ద్వారా ఆమె అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తొమ్మిది మంది ఎమ్మెల్యే అభ్యర్థులను కూడా ప్రకటించారు. సీనియర్ బీజేపీ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి, సిటింగ్ ఎంపీ ప్రతాప్ చంద్ర షడంగిని బాలాసోర్ నుంచి పోటీకి నిలబెట్టిన విషయం తెలిసిందే. చివరి క్షణం వరకు సన్నిహిత సీనియర్ నాయకునితో ప్రత్యర్థిగా లేఖశ్రీ సామంతసింగార్ ప్రత్యక్షంగా తలపడడం పోటీ రసవత్తరం అవుతుంది. బీజేడీ గతంలో 20 మంది ఎంపీ అభ్యర్థుల జాబితాని బీజేడీ విడుదల చేసింది.

శాసనసభ అభ్యర్థుల జాబితా..

రాష్ట్రంలో 9 శాసన సభ స్థానాలకు బిజూ జనతా దళ్ అభ్యర్థుల జాబితా విడుదల చేసింది. బీజేడీ విడతలవారీగా 4 జాబితాలతో ఎమ్మెల్యేల అభ్యర్థుల్ని ప్రకటించింది. ఈ జాబితాల్లో 9 గుణిజాలతో అభ్యర్థుల్ని ప్రకటించినట్లు స్పష్టం అవుతుంది. రాష్ట్రంలో 147 శాసన సభ స్థానాలు ఉన్నాయి. మరో 30 స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించాల్సి ఉంది. లక్ష్మీపూర్(ప్రభు జానీ), పారాదీప్(గీతాంజలి రౌత్రాయ్), సంబలపూర్ (ప్రసన్న ఆచార్య), రైరాఖోల్(రోహిత్ పూజారి), తెల్కోయ్(మాధబ్ సర్దార్), తాల్చేర్(బ్రజా కిషోర్ ప్రధాన్), నౌర్లా(మనోరమా మహంతి), భువనేశ్వర్ సెంట్రల్(అనంత నారాయణ్ జెనా), బలిగుడ(చక్రమణి కన్హర్)లకు అభ్యర్థులు ప్రకటించారు.

పోరాట యోధుడు పైలాకు నివాళి

పలాస: పలాస మండలం బొడ్డపాడు అమర వీరుల స్మారక మందిరం వద్ద గురువారం సిక్కోలు గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధుడు పైలా వాసుదేవరావుకు సి.పి.ఐ. ఎం.ఎల్ న్యూడెమొక్రసీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సిక్కోలు అమరవీరులకు పేరు పేరునా జోహార్లు సమర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఆయన విప్లవోద్యమంలో పాల్గొని ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు కె.హేమక్క, పుణ్యవతి, గీత, పోతనపల్లి కుసుమ, గొరకల బాలకృష్ణ, రాపాక మాధవరావు, గర్తం కామేశ్వరరావు, గోపి, పోతనపల్లి మల్లేశ్వరరావు, రెయ్యి సింహాద్రి, భాస్కరరావు, జె.అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దొండొనాచో దీక్ష


దొండొనాచో దీక్షధారుడి విన్యాసాలు


దొండొనాచొ దీక్షధారుల అగ్నికీల ప్రదర్శనలు


పూజలందుకుంటున్న అమ్మవారు


ధూళి దొండోలో దీక్షాధారులు


పర్లాకిమిడిలో నీలమ్మ అమ్మవారి పండుగలు


గ్రామదేవత అమ్మవారి పండుగల్లో మహిళలు

బరంపురం : గంజాం జిల్లాలో ప్రసిద్ధి చెందిన దొండొనాచొ దీక్ష పూజలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నగరంలోని పలు వీధుల్లో దొండొనాచోలు నిర్వహిస్తున్నారు. మిట్ట మధ్యాహ్నంతో మొదలయ్యే ప్రక్రియ రాత్రికి దొండొకాళి పూజలు జరిపాక తెల్లవారు జాము వరకు కొనసాగుతుంది. బుధవారం రాత్రి బాలాజీపేటలో జరిగిన దొండొనాచొ దీక్షాధారుల అగ్నికీలల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పర్లాకిమిడి: చైత్రమాసం సందర్భంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో మా కాళీ దొండొనాచో జాతరలు జరుగుతున్నాయి. గురువారం మాశ్యామకాళీ మందిరంలో దీక్షాధారులు ధూళిదొండో విన్యాసాలు జరిపారు. ఈనెల 14వ తేదీన దీక్షలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. అలాగే పట్టణంలో కాపువీధి, రైల్వే స్టేషన్ వీధుల్లో గ్రామదేవత నీలమ్మ అమ్మవారి పండుగలు జరుగుతున్నాయి.

రహదారి రక్తసిక్తం

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి


ప్రమాదానికి గురైన బైక్ వద్ద పోలీసులు


ప్రమాద స్థలంలో శోధిస్తున్న పోలీసులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

జయపురం: జయపురం సదర్ పోలీసు స్టేషన్ పరిధి గగణాపూర్ సమీపంలో బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. మరో నలుగురిని పోలీసులు కాపాడారు. మృతి చెందిన వారు ధనపూర్ గ్రామానికి చెందిన పద్మణ హరిజన్(26), జయంతిగిరి గ్రామానికి చెందిన గోపాల హరిజన్(23), అంబాగుడ పంచాయతీ సనముండ పాదర్ గ్రామానికి ధుర్జ కెవుట్(18) అని పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. ఇదే ఘటనలో తీవ్రంగా గాయపడిన వారిలో ధనపూర్ పంచాయతీ దిశారిగుడ గ్రామానికి చెందిన సురేంద్ర బారిక్(17), సనముండపాదర్ గ్రామానికి చెందిన బాబుల్ పాయిక్(15)శివ కెవుట్(18) బలరాం కెవుట్(16)లు ఉన్నట్లు తెలిపారు. రెండు బైక్‌లు పరస్పరం గుద్దుకున్న వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులు, మృతులను ఆ చీకటిలో వెలికి తీశారు. ధన్‌పూర్‌లో జరుగుతున్న బలిజాత్ర చూసేందుకు సనముండపాదర్ గ్రామం నుంచి బాబులు పాయిక్, శివ కెవుట్, బలరాం కెవుట్, ధుర్జ కెవుట్ లు ఒక బైక్‌పై వెళ్లి తిరిగి ధనపూర్ నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. అలాగే బలిజాత్ర చూసిన పద్మణ హరిజన్, గోపాల్ హరిజన్, సురేంద్ర బారిక్‌లు మరో బైక్‌లో ధనపూర్ నుంచి జయపురం వస్తున్నారు. ఈ రెండు బైక్‌లు సేవా పేపరుమిల్లు కూడలి దొలైపుట్ రహదారిలో ముఖాముఖి ఢీకొన్నాయి. దీంతో రెండు బైక్‌లపై ఉన్న ఏడుగురు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డారు. పోలీసులు టార్చ్‌లతో వెతికితే గానీ వీరు కనిపించలేదు. క్షతగాత్రులను జయపురం కేంద్రాస్పత్రికి తరలించారు. అలాగే ప్రమాద సమాచారాన్ని మృతుల కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని పలువురు కోరారు. ఎస్‌ఐ రాజకిశోర్ బారిక్, ఏఎస్‌ఐ సుశాంత దళపతి, ప్రియదర్శి గొమాంగోలు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు.

43 కిలోల గంజాయి స్వాధీనం

రాయగడ: జగదల్‌పూర్ నుంచి హౌడా వెళ్లే సమలేశ్వరి రైల్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహిళలను జీఆర్పీ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 43.500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాయగడ రైల్వే స్టేషన్ జీఆర్పీ డీఎస్పీ నిరంజన్ పాఢి తెలియజేసిన వివరాల ప్రకారం .. బుధవారం మధ్యాహ్నం సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ రాయగడకు చేరుకుంది. సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు మహిళలను అనుమానించి, వారి బ్యాగులను తనిఖీ చేయగా అందులో గంజాయి పట్టుబడింది. సుందర్‌ఘడ్ జిల్లాకు చెందిన మహిళలు కొరాపుట్ నుంచి గంజాయిని అక్రమంగా సుందర్‌ఘడ్‌కు తరలిస్తున్నట్లు దర్యాప్తులో బయటపడింది. నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిని మహిళా కోర్టుకు తరలించారు.

16 స్థానాల్లో జేఎంఎం పోటీ

భువనేశ్వర్: ప్రస్తుత శాసనసభ ఎన్నికల్లో జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) 16 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టనుంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర శాఖ కార్యదర్శి దుబ్రాజ్‌నాగ్ గురువారం జాబితా ప్రకటించారు. రాష్ట్రంలోని 6 జిల్లాల్లో జేఎంఎం అభ్యర్థులను బరిలోకి దింపుతున్నట్లు వెల్లడించారు. మయూరభంజ్ జిల్లాలో రాయరంగ్‌పూర్, సరొసొకొనా, బంగిరిపోషి, మొరోడా, జశీపూర్, బరిపద, ఉదొలా, కరంజియా నియోజక వర్గాలు, సుందరగడ్ జిల్లా బీరమిత్రపూర్, బొణై, రాజ్‌గంగ్‌పూర్, రఘునాథ్‌పల్లి, బాలాసోర్ జిల్లా బొస్తా, జాజ్‌పూర్ జిల్లా సుకింద, ఢెంకనాల్ జిల్లా పరజంగ్, కెంజొహర్ జిల్లా చంపువా స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దించనున్నట్లు తెలిపారు. మయూర్‌భంజ్ లోక్‌సభ స్థానం నుంచి కూడా పార్టీ పోటీ చేస్తుందని సమాచారం.

గుణుపూర్ శాసనసభ బీజేపీ పరిశీలకునిగా శివాజీ దాస్



రాయగడ: జిల్లాలోని గుణుపూర్ శాసనసభ నియోజకవర్గానికి బీజేపీ ఎన్నికల పరిశీలకునిగా ఆ పార్టీ అధిష్ఠానం శివాజీ దాస్‌ను నియమించింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గుణుపూర్ శాసనసభ నుంచి ఆ పార్టీ నుంచి త్రినాథ్ గొమాంగొ పోటీ చేయనున్నారు. ఈ శాసనసభ నియోజకవర్గాన్ని కైవసం చేసుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్న నేపథ్యంలో శివాజీని పరిశీలకునిగా నియమించడంపై ఆ పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. శివాజీ ఇదివరకు బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా సేవలు అందించారు.

నాటు తుపాకీ స్వాధీనం


నాటు తుపాకీతో నిందితుడు జగబంద్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు గురువారం సోమనాథ్‌పూర్ పంచాయతీలో ఓ ఇంటిలో నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. కోరుకొండ సమితిలో సోమనాథ్ పూర్ పంచాయతీ కుపులిగూడ గ్రామంలో జగబంద్ గౌడ్ అనే వ్యక్తి తన ఇంటిలో నాటు తుపాకీ ఉంచినట్లు బలిమెల ఐఐసీ సుమాన్ పట్నాయిక్‌కు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో గురువారం జగబంద్ ఇంటిపై దాడి చేయగా నాటుతుపాకీ దొరికింది.

స్వగ్రామం నుంచి ప్రచారానికి శ్రీకారం


మద్దతుదారులతో కలిసి ప్రచారం చేస్తున్న అనసూయా మాఝి

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రతిష్టాత్మకంగా గుర్తింపు పొందిన రాయగడ శాసనసభ స్థానం నుంచి బీజేడీ తరఫున పోటీ చేస్తున్న అనసూయా మాఝి సొంత గ్రామమైన కాసీపూర్ సమితి కుచేయిపాదొరొలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ముందుగా చితాగుడిదేవి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం మద్దతుదారులతో కలిసి ఇంటింటా తిరిగారు. మీ ఇంటి బిడ్డను ఆశీర్వదించి రాజధానికి పంపించాలని.. అన్నివేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుచేయిపాదొనా సర్పంచ్ బంగారి తదితరులు పాల్గొన్నారు.

జయపురంలో రంజాన్ ప్రార్థనలు


నమాజ్ చేస్తున్న ముస్లింలు

జయపురం: జయపురంలో ముస్లింలు ఈద్–ఉల్–ఫితర్ ను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం సామూహిక ప్రార్థనలు చేశారు. స్థానిక ముసల్మాన్ అంజుమాన్ కమిటీ అధ్యక్షుడు ముస్తఫా బేగ్ పర్యవేక్షణలో జరిగిన ప్రార్థనల్లో అంతా పాల్గొని ముబారక్ చెప్పుకున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

జయపురం: జయపురం సమితి గొడొపాదర్ గ్రామ పంచాయతీ కళాగుడలో బుధవారం న్యాయ అవగాహన శిబిరం నిర్వహించారు. కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ముఖ్యఅతిథిగా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారణపతి సుమన్ జెన పాల్గొన్నారు. గౌరవ అతిథిలుగా న్యాయవాదులు కె.దివాకరరావు, హరీష్ చంద్ర ముదులి హాజరయ్యారు. సుమన్ జెన మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఎఫ్.ఐ.ఆర్ సమన్లు, సీఆర్‌పీసీ, వారెంట్ తదితర చట్టాలను సమగ్రంగా వివరించారు. ఇటువంటి చట్టపరమైన సమస్యలు ఎవరికైనా ఎదురైతే ఆ సమస్యను పరిష్కరించుకునేందుకు జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురాన్ని ఆశ్రయించాలన్నారు. దివాకర రావు, హరిష్ ముదులి మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా అందిస్తున్న న్యాయ సేవలను వివరించారు. పారాలీగల్ సమాజ సేవకులు మహాలక్ష్మీ పండా, రేణుక మహంతి, దేవేంద్ర కొహార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రదర్శన కేంద్రం ప్రారంభం


ప్రదర్శన కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ మహాజన్

రాయగడ: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. గుణుపూర్‌లో గల పౌరసంబంధాల శాఖ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రదర్శన కేంద్రాన్ని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ గురువారం ప్రారంభించారు. గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్, సిబ్బంది హాజరయ్యారు. కేంద్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ ప్రదర్శన కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుంచి ఎన్నికలు ఎలా నిర్వహించారనేది ఈ ప్రదర్శనలో ఫొటోలు, గ్రూప్ సిగ్నేచర్ బోర్డులు, గిరిజన గుడిసెలకు వినియోగించే బ్యాలెట్ బాక్సులు, లాంతర్లు, ఈబీఎంలు, వీవీపీఏటీలు తదితరవి ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశామన్నారు. ఓటింగ్ శాతం, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలకు ప్రాధాన్యమిస్తూ ఓటర్లకు అవగాహన కల్పించేలా ఈ ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

వైభవంగా ఉగాది వేడుకలు


ఉగాది వేడుకలు ప్రారంభిస్తున్న వి.ఎస్.ఎన్.రాజు


అలరించిన కాంతారా డ్యాన్స్


ఆకట్టుకున్న భువనేశ్వర్ బృందం డ్యాన్స్


అలరించిన రోబో డ్యాన్స్

పర్లాకిమిడి:

స్థానిక రాంనగర్‌లో హైటెక్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు అంగరంగవైభవంగా జరిగాయి. పర్లాకిమిడి కళ, సంస్కృతి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉగాది ఉత్సవాలకు హైదరాబాద్ నుంచి శివారెడ్డి, జబర్దస్త్ కళాకారులు విచ్చేసి ప్రేక్షకులను మైమరపించారు. హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ డా.తిరుపతి పాణిగ్రాహి, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.ఎస్.ఎన్.రాజు ఉత్సవాలను ప్రారంభించారు. న్యాయవాది శైలాడ శ్రీరాములు, ఎన్.వీర్రాజు, గుమ్మా బ్లాక్ అధ్యక్షురాలు సునేమీ మండళ్, కాశీనగర్ బ్లాక్ నాయకులు మధు బీజేడీ పార్టీ నాయకులు తదితరులు విచ్చేశారు.

క్లుప్తంగా

గుడివాడలో చెస్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధం



జిల్లా స్థాయి చెస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో కృష్ణా జిల్లా గుడివాడలో జరగనున్న అండర్-17 బాల,బాలికల చెస్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు సిద్ధమైంది. చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఫైర్‌చెస్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 50మంది క్రీడాకారులు పాల్గొనగా..వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కేవీ.జ్వాలాముఖి ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పోటీల్లో బాలికల విభాగంలో మోక్ష, కర్రోతు సాయి జాహ్నవి, బాలుర విభాగంలో కాండ్రేగుల ప్రహ్లాద, కాండ్రేగుల సోమనాథ్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో ఉన్నారు.

మూడెకరాల అరటి తోట దగ్ధం

గుర్ల: మండలంలోని గోవుపేటలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు ఎకరాల అరటి తోట కాలిపోయింది. పల్లిగండ్రేడు గెడ్డలో గుర్తు తెలియని వ్యక్తి రెల్ల, ఎండిన గడ్డికి మంటపెట్టడంతో అగ్ని వ్యాపించి అరటి తోట వరకు వచ్చిందని రైతు తిరుమలరాజు సూర్యనారాయణరాజు, స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.మూడు లక్షల అస్తినష్టం జరిగి ఉంటుందని రైతు చెబుతున్నాడు.

అనుమానాస్పద మృతి కేసు నమోదు



సంఘటనా స్థలం వద్ద శంకరరావు మృతదేహం

పాచిపెంట: ఉపాధిహామీ పథకంలో బీఎఫ్‌టీగా పనిచేస్తున్న పాచిపెంట మండల కేంద్రానికి చెందిన డోల శంకరరావు(36) మరణంపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసినట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ, మండలంలోని పి.కోనవలస సమీపంలో బట్టి గట్టు వద్ద శంకరరావు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి రూరల్ సీఐ బాలకృష్ణతో కలిసి వెళ్లి పరిశీలించామని చెప్పారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సీతానగరం: మండలంలోని కొత్తవలసలో ఓ ఇంట్లో ప్రమాదవశాత్తు కట్టెలపొయ్యి నిప్పులు అంటుకుని గాయాల పాలైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు గురువారం తెలియజేశారు. వివరాలిలా ఉన్నాయి. గత నెల 20న ఉదయం 7 గంటల సమయంలో కొత్తవలసలో కన్నవారింటి వద్ద కట్టెలతో వంట చేస్తున్న సమయంలో చీరపైట కొంగుకు అగ్నికీలలు తగిలి కాలిపోవడంతో మంగమ్మ గాయాల పాలైంది. కాలిన గాయాలతో ఆమెను చికిత్స నిమిత్తం పార్వతీపురం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల నిమిత్తం రాగోలు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. కొత్తవలస గ్రామానికి చెందిన మంగమ్మకు సూరంపేట గ్రామానికి చెందిన బొబ్బిలి గౌరీశంకరరావుతో రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఆ దంపతులకు ఒక మగబిడ్డ. గతనెల 21న ఆ బిడ్డకు బాలసారె నిమిత్తం 20వ తేదీన వంటలు చేస్తుండగా ప్రమాదం జరిగిందని మృతురాలి కుటుంబసభ్యులు తెలియజేశారు.

ఆటో బోల్తాపడి వ్యక్తి..



సింహాచలం(ఫైల్)

పార్వతీపురం టౌన్: మండలంలోని హెచ్.కారాడవలస గ్రామసమీపంలో ఆటో బోల్తా పడి ఓ వ్యక్తి గురువారం మృతిచెందాడు. ఈ ప్రమాదంపై పార్వతీపురం రూరల్ ఎస్సై దినకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాళ్లబురిడి గ్రామం నుంచి నిడగల్లు గ్రామానికి వెళ్తున్న ఆటో హెచ్.కారాడవలస సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడింది, ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న పైల సింహాచలం, పడాల సుబ్బలక్ష్మి, అనూషలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పైల సింహాచలం (67)మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై దినకర్ చెప్పారు.

సమయం ఆసన్నం



- వారంలో ఎన్నికల ప్రధానఘట్టం
- 18న నోటిఫికేషన్ విడుదల
- పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళి పాటించాల్సిందే
- పకడ్బందీ కసరత్తు చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారులు

విజయనగరం అర్బన్: సార్వత్రిక ఎన్నిల షెడ్యూల్ మేరకు మరో వారం రోజుల్లో ఎన్నికల ప్రధాన ఘట్టం ప్రారంభం కానుంది. ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుంది. గత నెల 16వ తేదీన షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీకి పకడ్బందీగా జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. జిల్లాలోని విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు మిగిలిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నామినేషన్ ప్రక్రియ ఈ నెల 18 నుంచే ప్రారంభమవుతుంది. విజయనగరం పార్లమెంట్ స్థానానికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆర్‌ఓగా కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో, విజయనగరం అసెంబ్లీ ఆర్‌ఓగా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ కలెక్టరేట్‌లోని జేసీ సమావేశ మందిరంలో నామినేషన్‌లు స్వీకరించనున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో ఆయా ఆర్‌ఓలు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్‌లు స్వీకరిస్తారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నియమావళిని, నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ఎన్నికల్లో పోటీ చేసేవారికి ఉండాల్సిన అర్హతలపై ఎన్నికల కమిషన్ దిశానిర్దేశం చేసింది. అలాగే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు సువిధ యాప్‌ను ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తీసుకు వచ్చింది.

నామినేషన్ దాఖలు ఇలా..

సువిధ యాప్ ద్వారా నామినేషన్ దాఖలు చేసిన తర్వాత హార్డ్ కాపీలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేసే క్రమంలో చాంబర్‌లోకి అభ్యర్థితోపాటు ఐదుగురు వ్యక్తులను మాత్రమే అనుమతిస్తారు.

- అభ్యర్థులు తమ బి-ఫారమ్, ఎ-ఫారమ్ ఒరిజినల్ అందజేయాలి. వాటిని నామినేషన్ గడువు ముగిసే రోజు మధ్యాహ్నం మూడు గంటల్లోపు అందజేయవచ్చు
- అభ్యర్థులు రెండు (ఒకటి స్టాంప్ సైజ్, మరొకటి పాస్‌పోర్ట్ సైజ్) ఫొటోలను నామినేషన్‌తోపాటు అందజేయాలి. అభ్యర్థి తన ఓటరు కార్డు, బలపరిచే వారి గుర్తింపు పత్రాలు ఇవ్వాలి

గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు ప్రతి అభ్యర్థి దాఖలు చేయాలి

- నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రతిజ్ఞ తప్పనిసరిగా చేయాలి. ప్రతిజ్ఞ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాలి
- ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అభ్యర్థి తన సంతకం ఉండే విధానాన్ని విధిగా తెలియజేయాలి. అదేవిధంగా బ్యాలెట్ యూనిట్‌లో తన పేరును ఎలా ముద్రించాలో వివరించి చెప్పాలి
- అభ్యర్థి చెల్లించిన ధరావత్తుకు సంబంధించి రసీదుతోపాటు, ఎన్నికల ఖర్చును నమోదు చేసేందుకు నిర్ణీత నమూనాలో ఉన్న రిజిస్టర్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి తీసుకోవాలి.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఏవైనా క్రిమినల్ కేసులు ఉంటే, వాటిని మూడు దినపత్రికల్లో ప్రకటన ద్వారా బహిర్గతం చేయాలి. అందుకు అయ్యే ఖర్చుల లెక్క చూపాలి
- అన్ని పత్రాలను సువిధ అప్లికేషన్ యాప్ ద్వారానే అందజేయాలి. ప్రచారానికి సంబంధించిన కార్యక్రమాలు, వాహనాలు, ఇతర వాటికి ఈ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటేనే అనుమతి ఇస్తారు.

పోటీ చేసే అభ్యర్థులకు అర్హతలు

అభ్యర్థి తప్పనిసరిగా భారత దేశ పౌరుడు అయి ఉండి నామినేషన్ దాఖలు చేసే రోజుకు 25 ఏళ్లు పూర్తి కావాలి రాష్ట్రంలో ఏదైనా నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి.

- పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులను నలుగురు, స్వతంత్రంగా పోటీ చేసే అభ్యర్థులను 10 మంది ఓటర్లు బలపర్చాలి. బలపరిచే వారు అదే నియోజకవర్గానికి చెందిన ఓటర్లై ఉండాలి
- ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సాధారణ కేటగిరీ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలి.
- ఎంపీగా పోటీ చేసేందుకు సాధారణ కేటగిరీ అభ్యర్థులు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 డిపాజిట్ చెల్లించాలి.
- నామినేషన్ దాఖలు చేయడానికి 48 గంటల ముందు అభ్యర్థులు తప్పనిసరిగా వారి పేరిట ఏదైనా గుర్తింపు బ్యాంకులో ఖాతా తెరవాలి. ఆ ఖాతా ద్వారానే ఎన్నికల ప్రచారానికి, ఇతర అవసరాలకు వెచ్చించిన సొమ్ముకు సంబంధించి లావాదేవీలు నిర్వహించాలి. ఖాతా పుస్తకం ప్రతిని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఇవ్వాలి.
- ఫారం-2బిలో నామినేషన్ పత్రం దాఖలు చేయాల్సి ఉంటుంది.
- నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నోటరీతో కూడిన అఫిడవిట్ సమర్పించాలి. అందులో అభ్యర్థి,
- అతని కుటుంబసభ్యుల స్థిర, చర ఆస్తుల వివరాలను చూపించాలి. అదే విధంగా కేసుల వివరాలను, క్రైం నెంబర్‌తో సహా పొందుపరచాలి.
- ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగానికి రాజీనామా చేయాలి. రాజీనామాను ఆమోదించినట్లు ప్రభుత్వం జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని నామినేషన్‌తోపాటు దాఖలు చేయాలి.
- అభ్యర్థులు ఇంటి, నీటి పన్ను, విద్యుత్ చార్జీ బిల్లు బకాయిలు లేనట్లు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి.

అందుబాటులో అఫిడవిట్:

అభ్యర్థులకు సంబంధించిన అఫిడవిట్‌ను అందరికీ తెలిసేలా అందుబాటులో ఉంచుతారు. ప్రజలు కోరితే వాటిని ఉచితంగానే అందజేస్తారు. ఆన్‌లైన్‌లోనూ ఇవి అందుబాటులో ఉంటాయి.

- ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల అనంతరం ఆ రోజు వచ్చిన నామినేషన్లపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు తెలియజేస్తారు.
- నామినేషన్లను, అఫిడవిట్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనూ, నోటీస్ బోర్డులోనూ ప్రజల పరిశీలనకు ఉంచుతారు.
- నామినేషన్ దాఖలు పారదర్శకంగా ఉండేందుకు ప్రక్రియను సంపూర్ణంగా వీడియో తీయిస్తారు.

మోసపూరిత టీడీపీ హామీలను నమ్మవద్దు

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



ఆంద్రలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మెంటాడ: ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలిస్తున్న టీడీపీని ప్రజలు నమ్మి మోసపోవద్దని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన మెంటాడ మండలంలోని ఆంద్ర గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి శాసనసభ్యుడిగా తనను, అరకు పార్లమెంట్ అభ్యర్థిగా డా.తనూజా రాణిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో రాజన్నదొరకు అడుగడుగునా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల చెంతకే ప్రభుత్వాన్ని తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపనకు గ్రామాల్లో గ్రామ సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలను, ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పేదలకు ఆరోగ్య భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25లక్షలకు పెంచారని తెలిపారు. ఎన్నికల సందర్భంగా టీడీపీ ఇస్తున్న మోసపూరిత వాగ్దానాలు నమ్మి ఓటు వేస్తే ప్రస్తుత పథకాలన్నీ నిలిచిపోతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వాకపల్లి లక్ష్మి, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ త్రినాథ, రత్నాకర్ నాయుడు, చింతగడ శంకరరావు, కుంచ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో ప్రథమస్థానంలో విజయనగరం

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రా మెమోరియల్ వాలీబాల్ టోర్నీలో నాలుగు జిల్లాలకు చెందిన తొమ్మిది టీమ్‌లు పాల్గొనగా రెండు రోజుల పాటు పాలకొండలోని పెద్దకాపు వీధి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో కమిటీ సభ్యులు పోటీలు నిర్వహించారు. ఫ్లడ్‌లైట్స్ వెలుగులో చేపట్టిన ఆటల పోటీలు బుధవారం అర్ధరాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో విజయనగరం జట్టు ప్రథమ స్థానంలో నిలవగా వారికి రూ.25వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన శ్రీకాకుళం జట్టుకు రూ.15వేలు, తృతీయ, చతుర్ధ స్థానాలు దక్కించుకున్న పార్వతీపురం మన్యం జిల్లా ఎ,సి జట్లకు రూ.10వేలు, రూ.8 వేల వంతున నగదు ప్రోత్సాహకాలు, మెమెంటోలు, ట్రోఫీలను దాతల సహకారంతో నిర్వాహకులు అందజేశారు. ఈ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు శ్రీకాకుళానికి చెందిన సాయిమోహన్, ఆది, విజయనగరానికి చెందిన పవన్‌లను గుర్తించి ఒక్కొక్కరికి రూ.1500 వంతున నగదు ప్రోత్సాహకాలను అందించారు.

ఏ కష్టమొచ్చిందో..?

- ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య
- ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లో గార్డుగా విధులు
- బ్యాంకులోనే ఎస్‌ఎల్‌ఆర్ రైఫిల్‌తో కాల్చుకున్న శంకరరావు
- భర్త మృతదేహాన్ని చూసి భార్య కన్నీరు మున్నీరు
- ఆర్థిక వ్యవహారాలే కారణమై ఉండొచ్చని భావిస్తున్న పోలీసులు
- వంగర మండలం కొట్టిశలో విషాదఛాయలు



రోదిస్తున్న కుటుంబసభ్యులు (ఇన్‌సెట్లో) పాలవలస శంకరరావు (ఫైల్)



సంఘటన స్థలం వద్ద కన్నీరు పెట్టుకుంటున్న భార్య శ్రావణి, కుమార్తె, కుమారుడు



రక్తపుమడుగులో కానిస్టేబుల్ శంకరరావు మృతదేహం

సీతమ్మధార/వంగర: బంగారంలాంటి ఉద్యోగం.. సంతోషకరమైన కుటుంబం.. ఏం కష్టమొచ్చిందో.. తెల్లవారుజామున విధుల్లో ఉన్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ ఎస్‌ఆర్‌ఎల్ రైఫిల్‌ను గుండెకు గురిపెట్టుకుని కాల్చుకున్నాడు. క్షణాల్లోనే కుప్పకూలిపోయి ప్రాణాలు విడిచాడు. ఈ ఘటన మొత్తం బ్యాంక్‌లోని సీసీ కెమెరాల్లో రికార్డయింది. కానిస్టేబుల్ ఆత్మహత్య దృశ్యాలు ప్రతీ ఒక్కరి మనసును కలచివేశాయి. విధులు ముగించుకుని ఇంటికొస్తాడనుకున్న భర్త మరణవార్త తెలియడంతో భార్య గుండె పగిలిపోయింది. బ్యాంకులో రక్తపు మడుగులో విగత జీవిగా పడి ఉన్న భర్తను చూసి ఆమె కన్నీరుమున్నీరుగా విలపించింది. తల్లి ఎందుకు రోదిస్తుందో తెలియని వయసులో చిన్నారులు పడిన వేదనను చూసిన వారి హృదయాలు ద్రవించిపోయాయి. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పాలవలస శంకరరావు(37) విధి నిర్వహణలో ఎస్‌ఎల్‌ఆర్ గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పోలీస్ వర్గాల్లో సంచలనం రేపింది. వివరాలివీ..

విజయనగరం జిల్లా వంగర మండలం కొట్టిశ గ్రామానికి చెందిన పాలవలస శంకరరావు(37) భార్య శ్రావణి, కుమారుడు కిశోర్‌చంద్రదేవ్(6) కుమార్తె జ్ఞానవిత(3)తో కలసి మద్దిలపాలెంలో నివాసం ఉంటున్నారు. 2010 బ్యాచ్‌కు చెందిన శంకరరావు(3908) ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ద్వారకానగర్‌లో జ్యోతిబుక్ డిపో గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో చెస్ట్‌గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 5.55 గంటల సమయంలో తన వద్ద ఉన్న ఎస్‌ఎల్‌ఆర్ గన్‌తో గుండెపై గురి పెట్టుకుని ముందుకు వంగి కాల్చుకున్నారు. ఈ శబ్దం విన్న తోటి ఉద్యోగులు వెంటనే వచ్చే చూసే సరికి శంకరరావు రక్తపు మడుగుల్లో పడి ఉన్నాడు. మృతి చెందినట్లు గుర్తించిన ఉద్యోగులు వెంటనే అధికారులు సమాచారం ఇచ్చారు. ద్వారకా ఏసీపీ రాంబాబు, సీఐ ఎస్.రమేష్, ఎస్‌ఐ ధర్మేంద్రతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. భార్యకు సమాచారం ఇవ్వడంతో ఆమె పిల్లలతో ఘటనా స్థలం వద్దకు చేరుకుని రక్తపు మడుగులో ఉన్న భర్త మృతదేహన్ని చూసి కన్నీరు మున్నీరైంది. క్లూస్ టీం వేలి ముద్రలు సేకరించింది. సీఐ ఎస్.రమేష్ సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై ఏసీపీ ఆధ్వర్యంలో సీఐ దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. అయితే ఆర్థిక వ్యవహారాలే ఆయన ఆత్మహత్య కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం కొట్టిశ గ్రామానికి ఆయన మృతదేహాన్ని తరలించారు. కుమారుడి మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు ధామోదరరావు, సింహాచలమమ్మతో పాటు తలగాం సచివాలయంలో మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సోదరి పుణ్యవతి కన్నీటిపర్యంతమయ్యారు. గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు.

కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్



కంట్రోల్ రూమ్‌కు వచ్చి పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల కార్యకలాపాలను ఆమె పరిశీలించారు. నమోదు చేసిన కేసులు, తీసుకున్న చర్యలను సీపీఓ పి.బాలాజీ, నోడల్ అధికారి డాక్టర్ సత్యప్రసాద్ కలెక్టర్‌కు ఈ సందర్భంగా వివరించారు. ఈ సందర్శనలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్డీ అనిత పాల్గొన్నారు.

రైలు ఢీ కొని మహిళ మృతి

సీతానగరం: మండలంలోని మరిపివలస సమీపంలో గురువారం ఉదయం రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటనపై పార్వతీపురం రైల్వే ఎస్సై జె.రత్నకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ట్రైన్ ఢీకొని మృతి చెందిన వ్యక్తి వివరాలకోసం రాహదారిపై వెళ్తున్న వారంతా చూసి మండలంలోని లచ్చయ్యపేట గ్రామానికి చెందిన కొంచాడ ఈశ్వరమ్మగా గుర్తించి ఆ గ్రామస్తులకు సమాచారం అందించారు. ఈ సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న మృతురాలి భర్త రామారావు మాట్లాడుతూ బుధవారం సాయంత్రం దేవాలయానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరి వెళ్లి రాలేదని, సమీప బంధువుల ఇంటికి వెళ్లి ఉండవచ్చని భావించి వాకబు చేస్తున్న సమయంలో రైల్వేట్రాక్‌పై ఉన్న మృతదేహాన్ని గుర్తించినట్లు కొందరు చెప్పారన్నారు. కొన్నాళ్లుగా ఆమెకు మతిస్థిమితం లేకపోవడంతో నిరంతరం తిరుగాడడం, స్థానిక దేవాలయాన్ని శుద్ధి చేస్తూ పూజలు నిర్వహిస్తోందని తెలిపారు. మృతురాలి భర్త రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలియజేశారు.

ఘనంగా కేవీఎస్ లాడ్జి, హోటల్ ప్రారంభం



లాడ్జి, హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ వైవీసుబ్బారెడ్డి
- పాల్గొన్న విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

విజయనగరం: నగరం నడిబొడ్డున ఆధునిక హంగులతో మయూరి టిఫిన్స్ వెనుక గల తిరుమల, మెడికవర్ ఆస్పత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన కేవీఎస్ లాడ్జిని, హోటల్‌ను రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి గురువారం ఉదయం ప్రారంభించారు. హోటల్ అధినేత కుప్పిలి శ్రీను దంపతులు అతిథులకు సాదరస్వాగతం పలికారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ పురోహితులు అతిథులతో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విశాలమైన ప్రాంగణంలో 40 ఏసీ గదులు, బ్యాంకెట్ హాల్, సూట్‌రూమ్‌తో అందరికీ అందుబాటు ధరలతో ఈ హోటల్‌ను ప్రారంభించామని ప్రొప్రైటర్ కుప్పిలి శ్రీను తెలిపారు. కార్యక్రమంలో ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ నగర మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే మల్లా విజయప్రసాద్, గజపతినగరం ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, డెంకాడ ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, బొండపల్లి ఎంపీపీ సీహెచ్ చలం నాయుడు, గుర్ల జెడ్పీటీసీ సీర అప్పల నాయుడు, గజపతినగరం జెడ్పీటీసీ గార తౌడు, వీఎంసీ 32 వ వార్డు కార్పొరేటర్ బి.లక్ష్మి, జీవీఎంసీ 60 వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, పి ఎస్‌ఆర్ కాంప్లెక్స్ చైర్మన్ పాకలపాటి సన్యాసిరాజు, తిరుమల హాస్పిటల్ చైర్మన్ కె.తిరుమల ప్రసాద్, సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి చైర్మన్ శ్రీరామ మూర్తి, మయూర హోటల్ ప్రొప్రైటర్ వై.బాబురావుతో పాటు పలువురు రాజకీయ, వ్యాపార ప్రముఖులు, అభిమానులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.


రాజన్నదొరకు పెదచామలాపల్లి మద్దతు



డిప్యూటీ సీఎం రాజన్నదొరకు మద్దతు తెలిపిన పెదచామలాపల్లి గ్రామస్తులు

మెంటాడ: మండలంలోని పెదచామలాపల్లి గ్రామం మద్దతు డిప్యూటీ సీఎం రాజన్నదొరకేనని గ్రామస్తులు గురువారం స్పష్టం చేశారు. గ్రామానికి చెందిన రాయి బంగారురాజు, దివకాల రాంబాబులను మండల టీడీపీ నాయకులు మభ్యపెట్టి సాలూరు తీసుకువెళ్లి టీడీపీ అభ్యర్థి సంధ్యారాణితో కండువాలు వేయించి సుమారు 40 కుటుంబాల వరకు తమ పార్టీలో చేరినట్లు చూపించడం అవాస్తవమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన 40 కుటుంబాల వారు సమావేశమై తాము మొదటి నుంచీ వైఎస్సార్‌సీపీవైపే ఉన్నామని, తమ మద్దతు రాజన్నదొరకేనని స్పష్టం చేశారు.

నేటి నుంచి ఉపకరణాల ఎంపిక శిబిరాలు



ఎస్.ప్రేమకుమార్, డీఈఓ

విజయనగరం అర్బన్: జిల్లాలోని క్లస్టర్ పరిధి భవిత కేంద్రాల్లో దివ్యాంగుల కోసం ఉపకరణాల ఎంపిక వైద్య శిబిరాలను సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఈ నెల 18 తేదీ వరకు విద్యాశాఖ నిర్వహిస్తుంది. ఈ క్రమంలో తొలిరోజున గరివిడి మండల క్లస్టర్ పరిధిలోని గుర్ల, మెరకముడిదాం, చీపురుపల్లి, గరివిడి మండలాలకు గరివిడి భవిత కేంద్రం వద్ద, అదే రోజున రాజాం క్లస్టర్ పరిధిలో సంతకవిటి, ఆర్.ఆముదాలవలస, వంగర, రాజాం మండలాలకు రాజాం భవిత కేంద్రం వద్ద ఎంపిక శిబిరాలను నిర్వహిస్తారు. 15న గజపతినగరం క్లస్టర్ పరిధిలోని మెంటాడ, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, గజపతినగరం మండలాలకు గజపతినగరం భవిత కేంద్రం వద్ద, అదే రోజున రామభద్రపురం క్లస్టర్ పరిధిలోని బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాలకు రామభద్రపురరం భవిత కేంద్రం వద్ద ఎంపిక శిబిరాన్ని నిర్వహిస్తారు. 18న డెంకాడ క్లస్టర్ పరిధిలో నెల్లిమర్ల, పూసపాటిరేగ, భోగాపురం, విజయనగరం, డెంకాడ మండలాలకు డెంకాడ భవిత కేంద్రం వద్ద అదే రోజున ఎస్.కోట క్లస్టర్ పరిధిలో కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, జామి, ఎస్.కోట మండలాలకు ఎస్.కోట భవిత కేంద్రం వద్ద ఉపకరణాల ఎంపికకు వైద్య శిబిరాలను చేపడతారు. జిల్లాలో ఉన్న 3 నుంచి 18 సంవత్సరాల వయసు గల శారీరక, సెరిబ్రల్ పాల్సీ, వినికిడి లోపం గల వారు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ ఎస్.ప్రేమకుమార్ సూచించారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులను 108లో తరలిస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం అక్కన్న అగ్రహారం గ్రామానికి చెందిన కామోజీ గురుమూర్తి, గరివిడి మండలం గెడ్డపువలసకు చెందిన తాడ్డి జగదీష్‌లు బైక్‌లపై ప్రయాణిస్తున్నారు. మెట్ట వద్ద ఎదురెదురుగా ఆ బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరూ రోడ్డుపై పడి గాయాలపాలయ్యారు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ మీసాల ఈశ్వరరావు క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించిన మెరుగైన వైద్యం నిమిత్తం రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి సమాచారం అందించారు. ఈ ప్రమాదంపై తమకెటువంటి సమాచారం అందలేదని స్థానిక పోలీసులు వెల్లడించారు.

నగదు రూ. 50 వేలకు మించితే సీజ్

- సీజ్ చేసిన నగదు, వస్తువులకు రసీదు ఇవ్వాలి
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల తనిఖీల్లో రూ.50 వేలు కంటే ఎక్కువ నగదు లభిస్తే వెంటనే సీజ్ చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి అధికారులను గురువారం ఆదేశించారు. ఆర్వోలు, ఏఆర్వోలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిస్టిక్స్ స్క్వాడ్స్ సభ్యులతో కలెక్టరేట్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నగదు ఎన్నికలకు సంబంధించినదని తేలితే వెంటనే సీజ్‌చేసి, కేసు నమోదు చేయాలని, ఎన్నికలతో సంబంధం లేకపోతే జిల్లా గ్రీవెన్స్ కమిటీకి నివేదించాలని సూచించారు. స్వాధీనం చేసుకున్న నగదు లేదా వస్తువుల వివరాలను నమోదుచేసి, వాటి యజమానికి తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు. సీజ్ చేసుకున్న నగదు లేదా వస్తువుల వివరాలను ఈఎస్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. బంగారు ఆభరణాలకు సంబంధించి వివాహిత మహిళ 500 గ్రాముల ఆభరణాలను, ఇతర మహిళలు 250 గ్రాముల ఆభరణాలను, పురుషులు 100 గ్రాముల ఆభరణాలను తమ వెంట తీసుకెళ్లవచ్చన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్.డి.అనిత, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.